క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం రేపు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లిలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం ఆరాధన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహాగణపతి పూజ, హోమ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ, సిద్ధయ్య మూలవర్లకు మహాభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేయనున్నట్లు వివరించారు. దైవకార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కేబుల్ దొంగను పట్టుకున్న రైతులు

పలమనేరు: పొలాల వద్ద కేబుళ్లను చోరీ చేసి, వాటిని కాల్చి, అందులోని రాగి వైర్లను విక్రయించి జల్సా చేసే ఓ దొంగోడిని గురువారం రైతులు పట్టుకున్న సంఘటన మండలంలోని ముసలిమొడుగులో చోటుచేసుకుంది. వివరాలు.. రెండు నెలలుగా ముసలిమొడుగు గ్రామ రైతుల పొలాల వద్ద కేబుళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధిత రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు సైతం చేశారు. అయినా చోరీలకు అడ్డుకట్ట పడలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పొలాల వద్ద కేబుళ్లను కాల్చిన వాసన రావడంతో రైతులు వెళ్లి చూడగా, అప్పటికే కాల్చి అందులోని కాపర్, అల్యూమినియంను తీసుకెళ్లినట్టు గుర్తించారు. అంతకు ముందు పొలాల వద్ద అనుమానాస్పదంగా సంచరించిన యానాది మల్లికార్జున అలియాస్ మల్లు ఈ పనులు చేసి ఉండవచ్చని అనుమానించారు. దీంతో రైతులంతా కలసి గురువారం పొద్దున్న అతన్ని పట్టుకుని తమదైన శైలిలో నిలదీసేసరికి ఇంతకాలంగా కేబుళ్లను చోరీ చేసింది తానేనని చెప్పాడు. దీంతో రైతులు అతడిని స్థానిక పోలీసులు అప్పగించారు.

స్వామి కణ్ణన్‌కు డాక్టరేట్


డాక్టరేట్ పొందిన స్వామికణ్ణన్

చిత్తూరు కలెక్టరేట్: పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు స్వామికణ్ణన్‌కు డాక్టరేట్ లభించింది. తిరుపతి జిల్లా శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో ది రోల్ ఆఫ్ సర్వశిక్ష అభియాన్ ఇన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఎ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆచార్య బీవీ మురళీధర్ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. డాక్టరేట్ పొందిన ఆయనను డీఈఓ దేవరాజు, ఏడీ విజయేంద్రరావు, వెంకటేశ్వర్లు, డీవైఈఓ చంద్రశేఖర్, పలువురు ఉపాధ్యాయులు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

నాలుగు మాస్టర్స్ డిగ్రీలు

2013లో ఎస్వీయూ రీసెట్‌లో మొదటి ర్యాంక్ సాధించి అనేక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన పత్రాలు, సదస్సుల్లో పాల్గొని స్వామికణ్ణన్ అనేక మన్ననలు పొందారు. కేంద్ర ప్రభుత్వం 2002 నుంచి అమలు చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలో గుణాత్మక విద్యను వృద్ధి చేయడంలో సమగ్ర పరిశోధన చేశారు. జిల్లాలోని రామకుప్పం మండలం ఆరిమానిపెంట గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన నాలుగు మాస్టర్స్ డిగ్రీలను పూర్తి చేసి ప్రస్తుతం సర్కారు బడిలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగుల దాడిలో దెబ్బతిన్న టమాట పంట

పెద్దపంజాణి: మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన కొత్తబూరగపల్లె, తిప్పిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, ముదిరెడ్డిపల్లె, గౌరీనగర్, జిట్టంవారిపల్లె, ఆకులవారిపల్లె గ్రామ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. బుధవారం రాత్రి కీలపట్ల ఫారెస్టు బీటు నుంచి వచ్చిన ఏనుగులు ముదిరెడ్డిపల్లె పంట పొలాలపై పడి నష్టం కలిగించాయి. ఈ దాడుల్లో టమాట పంటలు ధ్వంసమయ్యాయి. గురువారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బాధిత రైతులు అగస్తి, ఈశ్వరయ్య మాట్లాడుతూ, రూ.50వేల పంట నష్టపోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపి నష్టపరిహారం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏనుగుల దాడుల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. ఏటా పంట దిగుబడులు వచ్చే సమయంలో దాడులు చేస్తుండడంతో భారీగా నష్టపోతున్నట్లు తెలిపారు.

ఆ 50 పోలింగ్ బూత్‌లే కీలకం

- 54 కేంద్రాల్లో 90 శాతం దాటిన పోలింగ్
- వెయ్యికి పైగా ఓట్లు పోలైన కేంద్రాలు 24
- చిత్తూరులో 81 శాతం పోలింగ్.. ఇదే తొలిసారి


చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

చిత్తూరు అర్బన్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లలో బాగానే చైతన్యం వచ్చినట్లు కనిపిస్తోంది. ఎన్నడూలేనివిధంగా చిత్తూరు నియోజకవర్గంలో పోలింగ్ 81 శాతం దాటడం ఇదే తొలిసారి. ఇందులోనూ చిత్తూరు నగరంతో పోలిస్తే గుడిపాల, చిత్తూరు మండలాల్లో పోలింగ్ శాతం పెరగడం మరో విశేషం.

సహస్రం దాటేశారు..

చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 226 పోలింగ్ కేంద్రాలుంటే 2,02,850 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 24 పోలింగ్ కేంద్రాల్లో 25 వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. అంటే ఒక్కో కేంద్రంలో వెయ్యి ఓట్లకు పైనే పోలయ్యాయి. ఓబనపల్లె, దొడ్డిపల్లె, న్యూ ప్రశాంత్‌నగర్ కాలనీ, తేనబండ, సికె.పల్లె, అనుప్పల్లె, మురకంబట్టు, మంగసముద్రం, పెద్దహరిజనవాడ, మురుగానిపల్లె, టి.చవటపల్లె, జానకారపల్లె, తోటపాళ్యం, గంగాసాగరం.. చిత్తూరు మండలంలోని పచ్చనపల్లె, అనంతాపురం.. గుడిపాలలోని మరకాలకుప్పం, పిళ్లారికుప్పం ప్రాంతాల్లోని 24 పోలింగ్ కేంద్రాల్లో ఏకంగా వెయ్యికి పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ 24 పోలింగ్ కేంద్రాల్లో మొత్తంగా 25,964 ఓట్లు పోలవడం ఫలితాలపై ఆసక్తి రేపుతోంది.

నియోజకవర్గంలో ఓట్ల పోలింగ్ తీరు		
మొత్తం ఓటర్లు	:	2,02,850
పోలైన ఓట్లు	:	1,64,788
స్త్రీలు	:	84,278
పురుషులు	:	80,493
ఇతరులు	:	17
శాతం	:	81.24

90 శాతం మార్కు

మరోవైపు నియోజకర్గ పరిధిలో 48 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతంకు పైగా ఓట్లు పోలవడం మరో విశేషం. ఇందులో ఏనుగుంట్లపల్లె, 189–కొత్తపల్లెలో పోలింగ్ అత్యధికంగా 95 శాతం నమోదయ్యింది. దీని తరువాతి స్థానాల్లో సి.బండపల్లె, శ్రీరంగంపల్లె, ఇరువారం, చెర్లోపల్లె, ఖైదుగాని కండ్రిగ, ఆది లక్ష్మమాంబపురం, అప్పయ్యగారిపల్లె, గంగ్రాళ్లమిట్ల, తుమ్మింద, దిగువ మాసాపల్లె, చెరువుకింద ఊరు, కట్టకిందపల్లె, ఇరువారం, ముత్తుకూరు, బొమ్మసముద్రం, సకుమంద, పానాలూరు, మాపాక్షి, వసంతాపురం, 194–బండపల్లె, చిత్తపార, రామభద్రాపురం, తాళంబేడు, చిత్తపార, ఆనగల్లు, గొళ్లమడుగు, రాసనపల్లె, చెర్లోపల్లె, ఐనవేడు, కొత్తకోట, బంగారెడ్డిపల్లె, ముత్తుకూరు, నరిగపల్లె, గువ్వకల్లు, 190–రామాపురం, పెరుమాళ్ల కండ్రిగ, పెద్దశెట్టిపల్లె, చీలాపల్లె, డి.వెంగనపల్లె, పాపిశెట్టిపల్లె, పెద్దహరిజనవాడ, తొప్పాతిపల్లె, పత్రాంపల్లె, పి.కొత్తూరు, 189–కొత్తపల్లె పోలింగ్ కేంద్రాల్లో 90 నుంచి 94 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ ప్రాంతాల్లో 16 వేలకు పైగా ఓట్లు పోలవడం కొసమెరుపు. అది కూడా చిత్తూరు మండలంలో 90 శాతం మార్కును దాటిన పోలింగ్ కేంద్రాలే ఎక్కువగా ఉన్నాయి.

ఏం రమనన్నా.. ఎట్లుంది మూమెంటు?

- ఏ టీ కొట్టు వద్ద చూసినా ఫలితాలపై చర్చే
- ఏమాత్రం బయట పడని ఓటర్ల నాడి



పలమనేరు: ఎన్నికలు ముగిసి నాలుగురోజులవుతోంది. పట్టణంలోని టీ కొట్లు ఇప్పుడు రాజకీయ చర్చలకు వేదికలుగా మారాయి. ఏ నలుగురు చేరినా రాజకీయ విశ్లేషణలు, గెలుపోటములు, స్టేట్‌లో ఏ పార్టీ వస్తుంది, లోకల్‌గా ఎవరి పరిస్థితి ఏమిటనే మాటలు తప్పిదే మరో మాటల్లేవు. గంటకు నాలుగు టీలు తాగి కూర్చున్న చోటు నుంచి లేయకుండా పేపర్లు తిరగేస్తూ రాజకీయాలను మాట్లాడుకుంటున్నారు. పట్టణంలో ఇటీవల కొత్తగా పెట్టిన ఓ టీ దుకాణం వద్దకు భాస్కర అయనకు రాజకీయ గురువు రమణన్న చేరుకున్నారు. ఏం రమనన్నా..! మనది మూమెంట్ ఎట్లుందినా? అన్నాడు భాస్కర. ఏం అర్థం కాలే దురా భాస్కరా.. నేను నా వయసుకి ఎన్నో ఎలక్షన్లు చూసినాగానీ ఈసారి ఏం బుర్రే పనిచేయాలేదప్పా! అన్నాడు. కాదునా రాజకీయాల్లో నిన్ను మించిన పనోడు లేడని మంచి అనుభవముందని మూడు దినాల్లింకా నీతో మాట్లాడాలని వస్తే నీవు ఈ మాటంటే ఇంగ నా డౌట్ తీర్చేదెవరన్నా? అన్నాడు అమాయకంగా. ఉంద్రా సామీ ఆ పార్టీ వోళ్లు మేమే గెలిచేదంటారు..ఈ పార్టీవోళ్లు రిజల్ట్ రాని తెలుస్తుందని చెబ్తారు. ఎవురిమాట నమ్మాల్నో అర్థమే కాలేదే. మా ఊర్లో కొందర్ని ఇంగడిస్తే మగోళ్లెమో అట్టా ఇట్టా బయటపడతాఉండారు. ఈ ఆడోళ్ల మర్మమే తెలియలేదే. ముసలోళ్లని అడిగితే దేనికో వేసిండాంలే అని వాళ్లు బయటపెట్టలేదే. సరే ఈ టెన్షన్ వల్ల నాకు లైట్‌గా తలనొస్తా ఉండాది. ఇంకో టీ చెప్పు తాగేసి ఇంటికిపోతా అన్నాడు. ఈ పరిస్థితి ఓ టీకొట్ల దగ్గరే కాదు..టౌన్, పల్లెలనే తేడా లేకుండా ఏడ జూసినా ఇదే తరహాలో చర్చలు నడుస్తున్నాయి.

పొలంలోకి దూసుకెళ్లిన వ్యాన్

శ్రీరంగరాజపురం: పొలంలోకి వ్యాన్ దూసుకెళ్లిన సంఘటన మండలంలోని ముద్దుకుప్పం గ్రామం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పళ్లిపట్టు నుంచి చిత్తూరుకు వస్తున్నా వ్యాన్ చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ముద్దుకుప్పం గ్రామం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్నా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసుకువెళ్లింది. ఆ సమయానికి రోడ్డుపై ప్రయాణికులు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

టీబీని తగ్గించేందుకే బీసీజీ టీకా

నగరి: టీబీ వ్యాధిని తగ్గించేందుకే బీసీజీ టీకా వేస్తున్నట్లు జిల్లా టీకా అధికారి, డాక్టర్ రవిరాజు తెలిపారు. గురువారం నగరి మున్సిపల్, రూరల్ మండల పరిధిలో బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో ఏఎన్‌ఎంల ద్వారా ఈ టీకా వేస్తున్నామని తెలిపారు. 60 ఏళ్ల పైబడి ఉండేవారికి, పొగ తాగేవారికి, టీబీ ఉండి నయమైన వారికి, బాడీ మాక్స్ ఇండెక్స్ తక్కువ ఉన్నవారికి, టీబీ, షుగర్ వ్యాధులు ఉన్నవారికి ఈ వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. వ్యాక్సిన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఏవీ ఉండవన్నారు. అంగీకారం మేరకే వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే అరాచకాలు


తిరుమలరాజుపురం నాయకులను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో రౌడీలకు, మందు, డబ్బులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలిచేలా పని చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తను ఎప్పటికీ మరువనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. గురువారం ఆయనకు తిరుమలరాజుపురం మాజీ సర్పంచ్ షణ్ముగరెడ్డి, చంద్రకుమార్ ఎన్నికల సమయంలో టీడీపీ వారు చేసిన బెదిరింపులను విన్నవించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో టీడీపీ రౌడీలను దింపి ఓటర్లను బెదిరిస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురి చేశారని, ఇదంతా చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లోనే జరిగిందన్నారు. అయితే జీడీ నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి థామస్ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా తమిళనాడు రౌడీలను తీసుకొచ్చి బెదిరించాడని, ఎన్నికల నాడు కూడా నీచరాజకీయాలకు తెరలేపాడని ఆరోపించారు. కానీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు భయపడకుండా ఓట్లు వేశారని తెలి పారు. ప్రతి ఒక్కరికీ పాదాభివందనమన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజ లంతా వైఎస్సార్‌సీపీ వైపే నిలిచారని, ఎన్ని కల పోలింగ్ సరళే ఇందుకు నిదర్శనమని తెలిపారు. జనం మళ్లీ జగనన్న పాలన రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం తిరుమలరాజుపురం వైఎస్సార్‌సీపీ నా యకులు, కార్యకర్తలను అభినందించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ


యాదమరిలో డెంగీపై అవగాహన ర్యాలీ


తవణంపల్లెలో ..

యాదమరి(బంగారుపాళెం): ప్రజా భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు దోమ కాటుకు దూరంగా ఉండాలని చైతన్యం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలన్నారు. దోమ కాటు ద్వారా డెంగీ, చికున్‌గున్యా, జికా వైరెస్ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ, సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సబ్‌యూనిట్ అధికారులు రామకృష్ణ, ఫీరూసాహెబ్, సూపర్‌వైజర్ నారాయణ, పిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఐరాల: ప్రాణాంతక డెంగీ వ్యాధి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం 35 యర్లంపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఓపీ, మందుల నిల్వ, గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. సుఖ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. 35 యర్లంపల్లెలో ఆమె బాసిల్లస్ కాల్మెట్ గెర్విన్(బీసీజీ) వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు పైబడిన వారిలో బీపీ, షుగర్ ఉన్న వారు వ్యాక్సిన్ వేసుకోవాలని చెప్పారు. మూడు వారాలకు మించి దగ్గు ఉంటే క్షయ వ్యాధి కావొచ్చని, అవగాహన కలిగి, జాగ్రత్తలు పాటించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే రోగికి ఆరు నెలలపాటు మందులు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఆ మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 386 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడితే డెంగీ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో జ్వరం వస్తే ఎవరూ అశ్రద్ధ చేయవద్దని, వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలో డీఎంహెచ్‌ఓ వైద్య సిబ్బందితో కలిసి డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీరూసాహెబ్, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత, పీహెచ్‌ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం తవణంపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌వేలు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉంటూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.


యర్లంపల్లెలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి


తవణంపల్లె: డెంగీపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు


మహేష్‌యాదవ్‌ను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

యాదమరి(బంగారుపాళెం): మండలంలోని మాదిరెడ్డిపల్లెలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మహేష్ యాదవ్‌ను గురువారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డితో కలిసి పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మహేష్ యాదవ్‌పై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. బాధితుని ఇంటికి వెళ్లి సునీల్‌కుమార్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అండగా ఉంటామని, అధైర్యపడ వద్దని భరోసా ఇచ్చారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం


తుమ్మిందపాళ్యంలో ..

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తుమ్మిందపాళెంలో..

గుడిపాల: గురువారం తుమ్మిందపాళ్యంలో ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి చంద్రమహేష్ మాట్లాడుతూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీకి చెక్


బంగారుపాళెంలో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది


గుడిపాలలో..

బంగారుపాళెం: బిసిజి(బాసిల్లస్ కాల్మెట్ గురిన్) వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి(టీబీ)ని నివారించ వచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్ రాయన్ అన్నారు. మండలంలో గురువారం బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీజీసీ వ్యాక్సిన్ అవసరమైన వారిని గుర్తించి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వృద్ధులకు బీసీజీ టీకా వేసుకోవాలని తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు 100శాతం వ్యాక్సిన్ వేయా లని ఆదేశించారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల మండలంలో..

గుడిపాల: బీసీజీ వ్యాక్సినేషన్‌ను దశల వారీగా అందరికీ వేయనున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. గురువారం వసంతాపురంలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారికి మొదట విడతగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. టీబీ ఉన్నవారిని గుర్తించి వ్యాక్సిన్ వేస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ హెల్త్ సెంటర్లలో కూడా ప్రతి గురువారం వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉమామహేశ్వరి, ఎంపీహెచ్‌ఏ పాల్ జబసెల్వి, ఏఎన్‌ఎం రోస్లిన్, ఆశా కార్యకర్తలు స్వప్న, సుజిమ పాల్గొన్నారు.

పెద్దశేష వాహనంపై కోనేటిరాయుడి చిద్విలాసం


పెద్దశేష వాహనంపై విహరిస్తున్న కోనేటిరాయస్వామి

- వేడుకగా తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ పుణ్యక్షేత్రం కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, తిరుచ్చి ఉత్సవం, సర్వదర్శనం, హోమాలు, సాయంత్రం ఉయ్యాలసేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ వేద పురోహితుల మంత్రోచ్ఛరణల నడుమ మిథునలగ్నంలో ధ్వజారోహణ ఘట్టం దాదాపు రెండు గంటలు పైగా ఆగమోక్తంగా కంకణంబట్టార్ ఏకే. నరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు కీలపట్ల గ్రామం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ధ్వజారోహణం పూర్తయిన తరువాత సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని ఉయ్యాలపై కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు శేష వాహన సేవే ప్రధానం. ఆదిశేషనికి స్వామివారంటే ఎంతో భక్తి. కలియుగంలో స్వామివారు కొలువుదీరింది శేషాద్రి కొండపై, ధరించేది శేషవస్త్రం, పానుపు శేషుడు కాబట్టే ఉత్సవాల్లో శేషుడికి అత్యంత ప్రాధాన్యమిస్తూ తొలిరోజు శేష వాహనంపై స్వామివారిని ఊరేగించడమే ఈ వాహన సేవ విశేషం. రాత్రి శ్రీదేవి భూదేవి సమేతంగా సర్వాలంకార భూషితుడైన శ్రీకోనేటిరాయ స్వామివారు పెద్దశేష వాహనంలోకి వేంచేసి గ్రామ మాఢవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహనసేవ అనంతరం స్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహన సేవ నిర్వహిస్తారు.




ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు, తిరుచ్చిపై విహరిస్తున్న కోనేటిరాయస్వామి